జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | 16 | సెప్టెంబర్ | 2026 ◆ పేజీలు : 6



## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూలు పరిశీలించిన జిల్లా కలెక్టర్



- అర్హులైన వారికి ప్రభుత్వ ఫలాలు అందేలా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి
- విధులు పట్ల నిర్లక్ష్యం వహించిన ఎంపీడీ వోకు మెమో జారీ!
- ఆర్ ఐ పై చర్యలు
- జిల్లా కలెక్టర్ అంకిత్

2 లో...




# ఫిర్యాదు చేసింది..
# న్యాయం దక్కలేదు...

6 లో..

- సింగరేణిలో అక్షిత రాణి విషాదం.. అసలు నిజమేంటి?
- అప్రెంటిస్ షిప్ సమయంలో వేధింపుల ఆరోపణలు..
- ముందే ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదంటూ ఆరోపణలు..
- అధికారుల నుండి న్యాయం దక్కలేదంటూ ఆత్మ హత్యాయత్నం
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి..
- ఇది యాజమాన్య నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమా..?

## ప్రజా ఆదరణను చూసి ఓర్వలేకనే విమర్శలు



- ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడమే లక్ష్యం
- రాష్ట్ర ప్రజలను తప్ప దారి పట్టించేందుకు బిఆర్ఎస్ కుట్ర
- అసెంబ్లీ ప్రతిష్టను దెబ్బ తీసేలా బిఆర్ఎస్ వ్యవహారం: ఎమ్మెల్యే కోరం

**ఇల్లందు, సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి)** రాష్ట్ర ప్రజల ఆశీర్వాదాలతో కొలువు తీరిన ప్రజా ప్రభుత్వం నుంచి వస్తున్న ప్రజల ఆదరణను చూసి ఓర్వలేకనే బిఆర్ఎస్ లేనిపోని విమర్శలు చేస్తుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలను తప్పు దారి పట్టించేందుకు బిఆర్ఎస్ కుట్రలు పన్నుతుందని ఆరోపించారు. అసెంబ్లీ ప్రతిష్టను దెబ్బ తీసేలా బిఆర్ఎస్ వ్యవహారం మంచిది కాదని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్దే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని గుర్తు చేశారు. అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. విపక్షాలు ప్రభుత్వాన్ని బదనాం చేయడాన్ని మానుకోవాలని హితవు పలికారు. పేదలకు ప్రభుత్వ పథకాలు

మిగతా 2 లో...

## నీట్‌లో సత్తా చాటిన నివేదన్

- ఎంబీబీఎస్ సీటు సాధించిన బయ్యారం విద్యార్థి



**పినపాక, సెప్టెంబర్ 15(ప్రజాజ్యోతి)** పినపాక మండలం బయ్యారం గ్రామానికి చెందిన నవతెలంగాణ రిపోర్టర్ శ్రీరామ్ బృహస్పతి కుమారుడు నివేదన్ జాతీయ స్థాయి వైద్య ప్రవేశ పరీక్ష నీట్ (NEET)లో ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్ సీటు సాధించాడు. నీట్‌లో సాధించిన ప్రతిభ ఆధారంగా మహేశ్వరం మెడికల్ కాలేజీ, పటాన్‌చెరువులో ఎంబీబీఎస్ కోర్సులో ప్రవేశానికి నివేదన్ ఎంపికయ్యాడు.చిన్ననాటి నుంచే చదువుపై ఆసక్తి పెంచుకున్న నివేదన్.. లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో, పట్టుదలతో చదువును కొనసాగించాడు. వైద్య విద్యలో ప్రవేశం కోసం నిర్వహించే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నీట్ పరీక్షలో మంచి ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్ సీటు సాధించడం ద్వారా తన ప్రతిభను చాటుకున్నాడు.నివేదన్ విజయవార్త తెలియడంతో

మిగతా 2 లో...

## భద్రాద్రి కలెక్టరేట్ కి కల్తీ మరక

- ఫేక్ అధికారి ఐడీతో లక్షల స్కామ్..!
- బండి మధు ఒక్కడే ఉన్నాడా..? లేక కలెక్టరేట్ లో ఇంకెవరైనా ఉన్నారా..?
- ఒరిజినల్ కలెక్టరేట్ సైలెంట్.. డూప్లికేట్ కలెక్టరేట్ వైలెంట్..!
- రేషన్ కార్డు ఇప్పిస్తా..లక్షలు కొట్టేస్తా..! అంటున్న
- బండి మధు...
- బండి మధు చేతిలో కలెక్టరేట్..చేతులు కట్టేసుకున్న జిల్లా అధికారులు..!
- ఫేక్ ఐడీ ఒకడిది.. దోపిడీలో వాటా ఇంకొందరిది..?
- ఈ స్కాంలో ఎంత మంది అధికారుల హస్తం ఉందో..? అందుకే చర్యలు సూన్యం..?



- జిల్లా కలెక్టర్ ఇప్పటికైనా అడుగు ముందుకు వేస్తారా..!

2 లో...

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూలు పరిశీలించిన జిల్లా కలెక్టర్

**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 15, (ప్రజాజ్యోతి)** దుమ్ముగూడెం మండలం మల్కానపల్లి, చిన్నబండిరేవు గ్రామాల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం పరిశీలించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు, సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పని చేసి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.మల్కానపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను కలెక్టర్ అంకిత్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి పరిశీలించారు. సుమారు 2 కిలోమీటర్లు అటవీ ప్రాంతం గుండా నడిచి సర్వే పనుల పురోగతిని పరిశీలించారు. గ్రామ సరిహద్దులు, భూముల విస్తీర్ణం, ఎంజాయర్ల వివరాలు, పాత రెవెన్యూ రికార్డులు, క్షేత్రస్థాయి కొలతలు, రీ సర్వే పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సరిహద్దుల నిర్ధారణ పూర్తయినప్పటికీ రీ సర్వే ప్రక్రియ పెండింగ్‌లో ఉండటంపై కలెక్టర్ సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పాత రికార్డులు, మ్యాప్‌లు, కొలతలను సమన్వయం చేసి భూ రికార్డుల్లో పూర్తి స్పష్టత తీసుకురావాలని సూచించారు.సర్వే పరిధిలో సుమారు 120 మంది ఎంజాయర్లు ఉన్నట్లు అధికారులు వివరించగా, వారి సంఖ్య, భూ వివరాలు, పట్టాదారు పాసుపుస్తకాల పరిస్థితి, రీ సర్వే పురోగతిపై కలెక్టర్ సంబంధిత ఆర్ఐను ప్రశ్నించారు. అయితే ఆర్ఐ సరైన వివరాలను, ప్రాథమిక సమాచారాన్ని స్పష్టంగా అందించలేకపోవడంతో కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భూ రికార్డులు, సర్వే వివరాలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సంబంధిత ఆర్ఐపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దుమ్ముగూడెం మండలంలో మొత్తం 8 గ్రామాల్లో భూ రీ సర్వే చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 5 గ్రామాల సరిహద్దుల నిర్ధారణ పూర్తికాగా, 3 గ్రామాల్లో గ్రామసభలు పూర్తయ్యాయని, లింగాపురం పరిధిలో సుమారు 250 ఎకరాల్లో రీ సర్వే జరుగుతున్నట్లు వివరించారు. మిగిలిన పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరంమల్కానపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించి, లబ్ధిదారుల వారీగా నిర్మాణ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాల సంఖ్య, వారికి నిర్వహించిన సర్వే వివరాలను ఎంపీడీవో వివేక్ చంద్రను అడిగి తెలుసుకునే ప్రయత్నంలో సరైన సమాచారం అందించలేకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం, సరైన సమాచారం అందించకపోవడంపై ఎంపీడీవోకు చార్జ్‌మెమో జారీ చేసి, 24 గంటల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ప్రయోజనం అందేలా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని నిరంతరం పర్యవేక్షించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.చిన్నబండిరేవు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల భవనాలు, తరగతి గదులు, వసతి గృహాలు, ఇతర మౌలిక వసతుల నిర్మాణ పురోగతిని పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతి, భోజనం, క్రీడలు, ఇతర అవసరమైన సౌకర్యాలు సమగ్రంగా అందేలా క్యాంపస్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ అంకిత్ అన్నారు .ఈ పర్యటనలో తహసీల్దార్ అశోక్ కుమార్, ఎంపీడీవో వివేక్ చంద్ర, ఆర్ఐ, సర్వే అధికారులు, రెవెన్యూ, గృహ నిర్మాణ, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి కలెక్టరేట్ కి కల్తీ మరక

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. సెప్టెంబర్ 15, ప్రజాజ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం పేరు ప్రతిష్టలకే మచ్చ తెచ్చేలా ఒక సంచలన ఆరోపణ తెరపైకి వచ్చింది. జిల్లా కలెక్టరేట్ పేరు మీద ఫేక్ ఐడీ కార్డును సృష్టించి, అమాయక రేషన్ కార్డు లబ్ధిదారుల నుండి లక్షల రూపాయలు వసూలు చేసిన ఆరోపణ ఏకంగా జిల్లానే కుదిపేసింది. ఈ దందాకు పాల్పడ వ్యక్తిగా బండి మధు అనే వ్యక్తి పేరు తేలిన చర్యలు సూన్యంగా కనిపిస్తోంది. దీంతో కలెక్టరేట్ కి కల్తీ మరక రావడం గమనార్హం. అత్యంత పటిష్ట భద్రత, పరువు ప్రతిష్టలు ఉండాల్సిన కలెక్టర్ కార్యాలయం పేరునే అడ్డుపెట్టుకుని ఇంత బహిరంగంగా మోసానికి పాల్పడుతుంటే అధికారులు ఏం చేస్తున్నారనేది ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై రెండు సార్లు ప్రజాజ్యోతి పత్రికలో కథనాలు వచ్చినా, జిల్లా ఉన్నతాధికారుల్లో మాత్రం ఏ మాత్రం చలనం లేకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇది కేవలం ఒక వ్యక్తి చేసిన పనా..? లేక కలెక్టరేట్ లోని కొందరు అధికారుల అండదండలతోనే ఈ ఫేక్ ఐడీ దందా సాగుతోందా..? అనే ప్రశ్న ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది.కలెక్టర్ కార్యాలయం పేరుతో నకిలీ గుర్తింపు కార్డును తయారు చేయించుకోని, రేషన్ కార్డు లబ్ధిదారులను బెదిరించి, మాయమాటలు చెప్పి లక్షల రూపాయలు వసూలు చేసినోడు ముందు ముందు ఎలాంటి ఐడీ కార్డులు సృష్టించి ఇంకేత పేదల






నుంచి వసూళ్లు చేస్తాడో అనే చర్చే జిల్లాలో జోరుగా సాగుతోంది.ప్రభుత్వ పథకాల కోసం ఎదురుచూస్తున్న పేద లే లక్ష్యంగా ఈ దందా సాగుతుండటం గమనార్హం.

**బండి మధు ఒక్కడే ఉన్నాడా..? లేక కలెక్టరేట్ లో ఇంకెవరైనా ఉన్నారా..?**

జిల్లా పరిపాలనకు గుండెకాయ లాంటి జిల్లా కలెక్టరేట్...ఆ కలెక్టరేట్ పేరు మీదే ఒక దొంగ ఐడీ పుట్టుకొచ్చిందంటే ఇది సాధారణ విషయం కాదని తెలుస్తోంది. జిల్లాలో అత్యంత పటిష్ట భద్రత ఉండాల్సిన కలెక్టరేట్ గోడల మధ్య నుండే ఈ ఫేక్ ఐడీకి బీజం పడిందా..? లేక బయటే కూర్చుని కలెక్టరేట్ పేరును అడ్డుపెట్టుకుని బండి మధు అనే వ్యక్తి ఇంత సాహసానికి ఒడిగట్టాడా..? అనేది ఇప్పుడు జిల్లాలో అతిపెద్ద ప్రశ్నగా మారింది. ఒకవేళ ఇది బండి మధు ఒక్కడి ఆటే అయితే, జిల్లా భద్రతా వ్యవస్థ పూర్తిగా విఫలమైనట్లే తెలుస్తోంది. కలెక్టర్ కార్యాలయం పేరుతో ఎవరైనా ఐడీ చేసుకోని తిరిగితే కనిపెట్టలేని దుస్థితిలో జిల్లా యంత్రాంగం ఉందా..? ఒకవేళ అదే నిజమైతే రేపు ఉగ్రవాదులు కూడా ఇదే తరహాలో ఫేక్ ఐడీలతో కలెక్టరేట్ లోకి చొరబడే ప్రమాదం లేదా..? మరో కోణంలో చూస్తే, కలెక్టరేట్ లోని కొందరు అధికారుల అండదండలు లేకుండా ఇంత పెద్ద దందా సాధ్యం కాదని ప్రజా సంఘాలు బల్లగుద్ది చెబుతున్నాయి. అధికారుల హస్తం ఉంటేనే ఫేక్ ఐడీకి అధికారిక హంగులు వస్తాయని, లబ్ధిదారులను నమ్మించడం సులభమవుతుందని అంటున్నారు. అందుకే ఈ వ్యవహారంపై కలెక్టర్ స్వయంగా జోక్యం చేసుకుని, సీసీ ఫుటేజ్ నుండి ఐడీ జారీ విధానం వరకు లోతుగా విచారణ జరిపించి, నిజాలను నిగ్గు తేల్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**అధికారుల అండదండలతోనే ఫేక్ ఐడీ..! ఫేక్ అధికారి..!!**

ప్రజాజ్యోతి పత్రికలో వరుసగా కథనాలు వచ్చి, జిల్లా మొత్తం ఫేక్ ఐడీ భాగోతం గురించి గగ్గోలు పెడుతున్నా, కలెక్టరేట్ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం ఇప్పుడు అత్యంత అనుమానాస్పదంగా మారింది. సాధారణంగా కలెక్టర్ కార్యాలయం పేరును, లోగోను, స్టాంపును ఎవరైనా దుర్వినియోగం చేస్తే, అది ప్రభుత్వానికే సవాల్ గా భావించి నిమిషాల్లో క్రిమినల్ కేసులు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేయాల్సిన అధికారులు, ఈ విషయంలో మాత్రం కళ్ళు, నోరు మూసుకుని కూర్చోవడం వెనుక మతలబు ఏంటని జిల్లా ప్రజలు నిలదీస్తున్నారు. రెండు సార్లు కథనాలు రాసినా చలనం లేకపోవడం అంటే, ఇది నిర్లక్ష్యమా..? లేక కావాలనే మౌనం పాటిస్తున్నారా..? అనే అనుమానం జిల్లాలో బలంగా వ్యక్తమవుతోంది. అధికారులు ఇలా మౌనం వహించడం వల్లే బండి మధు లాంటి వ్యక్తులకు మరింత రెక్కలొచ్చాయని, వారి దందా రోజురోజుకూ పెరిగిపోతోందని, దీనికి పరోక్షంగా అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ప్రజలు, ప్రజా సంఘాల నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఎంతమంది భాధితులు, ఎంత వసూళ్లు చేశాడనేది కలెక్టర్ విచారణ చేయాలి...**

ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారాన్ని సీరియస్ గా తీసుకుని, బండి మధు అనే వ్యక్తి పాత్రపై, ఫేక్ ఐడీ ఎలా పుట్టుకొచ్చింది, ఎంతమంది దగ్గర ఎంత మొత్తం వసూలు చేశారనే అంశాలపై లోతైన విచారణకు ఆదేశించాలని, బాధిత లబ్ధిదారులకు న్యా యం చేయాలని సర్వత్రా డిమాండ్ వినిపిస్తోంది. లేకపోతే రేపటి రోజు ఇంకెవరైనా కలెక్టర్ పేరు చెప్పి దందాలు చేసినా అడిగే నాథుడే లేడనే అప్రతిష్ట జిల్లా యంత్రాంగానికి మూటగట్టుకునే ప్రమాదం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు.

## నీట్‌లో సత్తా చాటిన నివేదన్

(మొదటి పేజీ తరువాయి...)

బయ్యారం గ్రామంలో హర్షం వ్యక్తమైంది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు నివేదన్‌ను అభినందిస్తూ భవిష్యత్తులో వైద్య రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచి వైద్య విద్యలో అడుగుపెట్టడం బయ్యారం గ్రామానికే గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. కష్టపడి చదివితే గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు సైతం ఉన్నత లక్ష్యాలను సాధించగలరని నివేదన్ విజయం నిరూపించిందన్నారు. తన విజయానికి తల్లిదండ్రులు అందించిన ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, స్నేహితుల సహకారంతో పాటు తన నిరంతర శ్రమ, పట్టుదలే ప్రధాన కారణమని నివేదన్ కుటుంబ సభ్యులు తెలిపారు. భవిష్యత్తులో వైద్య రంగంలో ఉన్నత స్థానానికి చేరుకుని పేద, సామాన్య ప్రజలకు సేవ చేయాలన్నదే నివేదన్ లక్ష్యమని వారు తెలిపారు.

# ప్రజా ఆదరణను చూసి ఓర్వలేకనే విమర్శలు

(మొదటి పేజీ తరువాయి...)

అందవద్దనే బిఆర్ఎస్ లక్ష్యంతో ఉందని విమర్శించారు. అన్ని వర్గాల వారిని కాపాడేది కేవలం కాంగ్రెస్ పార్టీయేనని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ పార్టీ కేవలం వారి ఉనికిని కోల్పోతుందన్న భయంతోనే ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తుందని అగ్రహం వ్యక్తం చేశారు. 22/ఏ చట్టంలోని తప్పిదాలపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అనేక పర్యాయాలు స్పష్టత ఇవ్వడం జరిగిందని, అందులో ఉన్న పొరపాట్లను గుర్తించి సవరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినప్పటికి అసెంబ్లీలో సస్పెన్షన్ కు గురైన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు మంత్రి పొంగులేటిపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకుండా ప్రజా సమస్యలపై మాట్లాడకుండా ప్రతిపక్ష హోదాతో కొట్లాది రూపాయలను జీతభత్యాలు తీసుకుంటూ, నిరంతరం రాష్ట్ర అభివృద్ధి కోసం కేవలం ఒక్క రూపాయి వేతనం తీసుకుంటూ ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న మంత్రి పొంగులేటిని టార్గెట్ చేస్తూ అసత్య ఆరోపణలు చేయడాన్ని ప్రజలు క్షమించారని గుర్తు చేశారు. వాస్తవానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే 19/2007 చట్టం రూపొందించడం జరిగిందని, నేడు ఆ 2007 నాటి నిబంధన అమలులో ఉందని, ఈ క్లాజ్ వలన నిషేధిత జాబితాలో చేర్చిన భూముల కొనుగోలు, అమ్మకాలు మాత్రమే రిజిస్ట్రేషన్ జరగవని, ఎవరైతే భూ యజమానులుగా ఉన్నారో వారి యాజమాన్య హక్కులు యధాతదంగా ఉంటాయని తెలిపారు. అధికారుల తప్పిదల వలన కొన్ని భూములు నిషేధిత జాబితాలో చేర్చినట్లు ప్రభుత్వం ఇప్పటికే గుర్తించిందని, అటువంటి భూ యజమానుల అప్పీళ్లను పరిశీలించి నిషేధిత జాబితా నుండి వాటిని తొలగించడానికి నలుగురు ఉన్నతాధికారులతో కూడిన ఒక కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికి ఏర్పాటు చేసిందన్నారు. ఆ కమిటీలో జిల్లా కలెక్టర్ తో చర్చించి సెక్షన్ 22/ఏ లో చేర్చిన భూములను పరిశీలించి, పరిష్కరించడానికి చర్యలు చేపడుతున్నప్పటికీ విపక్షాలు ప్రభుత్వాన్ని బధనం చేసేందుకు తప్పుడు ప్రచారాలకు పూనుకున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష బిఆర్ఎస్ ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలను ప్రజలు నమ్మవద్దని, నిషేధిత జాబితాలో నమోదైన భూముల యజమానులు ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ గౌరవ ప్రతిష్టలు దిగజార్చే విధంగా సస్పెన్షన్ కు గురైన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాక్ అసెంబ్లీ పేరిట పోటీ సభ నిర్వహించి ముఖ్యమంత్రి, మంత్రులపై వ్యక్తిగత దూషణలు, ఆరోపణలు చేయడం సరికాదని, రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన శాసనసభ, దళిత స్పీకర్ అధ్యక్షతన జరుగుతున్న శాసనసభ సమావేశాలను అభహస్యం చేస్తూ దురుద్దేశాలతో వివరించడానికి ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని కోరారు. శాసనసభ సమావేశాల ప్రారంభం రోజున శాసనసభ ఎదుట అప్రజాస్వామికంగా బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివరించారని, శాంతి భద్రతలు పర్యవేక్షిస్తున్న పోలీసులు, మహిళా పోలీసులపై దాడులకు పూనుకోవడమే కాక స్పీకర్ ను దుర్భాషలాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ వ్యవహార శైలి తో వ్యవహరించినందున రాష్ట్ర ప్రభుత్వానికి, స్పీకర్ కు క్షమాపణలు చెప్పకపోగా, మాక్ అసెంబ్లీ పేరిట మరింత నీచంగా శాసనసభ ప్రతిష్టకు భంగం కలిగించే చర్యలకు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు పూనుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి ఒక్క హామీని ఏర్పడిన తర్వాత తూచా తప్పకుండా అమలు చేయడం జరుగుతుందని గుర్తు చేశారు. రైతాంగానికి రూ. 2లక్షల రుణమాఫీ చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానికే దక్కిందన్నారు. నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసమే పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో ఇల్లందు మునిసిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ పెండేల రాజు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు భోళ్ల సూర్యం, మండల రాము, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దొడ్డ డానియల్, వార్డు కౌన్సిలర్లు సైదా మియా, అజ్మీరా వంశీ, రాధ కమల్ కోరి, రేఖ స్వరూప, గందె పద్మ, మెరుగు కార్తీక్, రంప రమ్య, నీరుడు ఉపేంద్ర, ఉల్లింగ విజయలక్ష్మి , మహమ్మద్ జాఫర్, నీలపు రమేష్, కో ఆప్షన్ సభ్యులు మడుగు సాంబమూర్తి, సయ్యద్ అజామ్, సర్పంచులు మూడు సరస్వతి, లావణ్య కృష్ణ ప్రసాద్, పాయం స్వాతి, పాయం లలిత, వల్లాల మంగమ్మ, ధనసరి స్రవంతి, బాల కృష్ణ, గుగులోత్ నాగార్జున, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీలు

- బస్తీ దవాఖానాల్లో వైద్య సేవలు, మందులు, పరీక్షా కిట్ల లభ్యతపై సమీక్ష





**ఇల్లెందు, సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి)** ప్రపంచ రోగి భద్రతా వారోత్సవం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ మంగళవారం ఇల్లెందు పట్టణంలోని ఎల్‌బీఎస్ నగర్, హమాలీ బస్తీలో గల బస్తీ దవాఖానాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా బస్తీ దవాఖానాల్లో అందుతున్న వైద్య సేవలు, రోగుల హాజరు, మందుల లభ్యత, వైద్య పరికరాలు, ప్రయోగశాల పరీక్షలు తదితర అంశాలను పరిశీలించారు. ఎల్‌బీఎస్ నగర్ బస్తీ దవాఖానాలో రక్తపోటు పరీక్షలకు అవసరమైన బీపీ పరికరం, పియుఎఫ్ తదితర అవసరమైన సామగ్రిని సమకూర్చుకోవాలని సిబ్బందికి సూచించారు. అలాగే బస్తీ దవాఖానాలో అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మందులు, వైద్య సామగ్రిని ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.హమాలీ బస్తీ బస్తీ దవాఖానాను సందర్శించి సిబ్బంది అందుబాటు, వైద్య సేవల నిర్వహణపై సమీక్షించారు. మలేరియా పరీక్షా కిట్లు, మధుమేహం, రక్తపోటు నియంత్రణకు సంబంధించిన మందులు తగినంతగా అందుబాటులో ఉన్నాయా లేదా అని ఆరా తీశారు. అవసరమైన మందులు, పరీక్షా కిట్లను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచి ప్రజలకు నిరంతర వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పీహెచ్‌సీ కొమరారంలో వైద్య సిబ్బందితో డీఎంహెచ్ఓ సమావేశం నిర్వహించారు. ప్రపంచ రోగి భద్రతా వారోత్సవం ప్రాధాన్యతను వివరిస్తూ, ప్రతి రోగికి సురక్షితమైన, నాణ్యమైన, సమయానుకూలమైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని తెలిపారు. అనంతరం పీహెచ్‌సీకి వచ్చిన గర్భిణీ స్త్రీలతో డీఎంహెచ్ఓ మాట్లాడి గర్భధారణ సమయంలో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం, వైద్యుల సూచనలు పాటించడం, పోషకాహారం తీసుకోవడం, ప్రమాద సంకేతాలను గుర్తించడం వంటి అంశాలపై ఆరోగ్య అవగాహన కల్పించారు. సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలకు ప్రోత్సాహం ఇవ్వాలని, గర్భిణీలకు అవసరమైన కౌన్సెలింగ్, నిరంతర పర్యవేక్షణ అందించాలని సిబ్బందికి సూచించారు. రాబోయే మూడు నెలల ప్రసవ అంచనా తేదీల (ఈడిడి) క్యాలెండర్‌ను పద్ధతిగా నిర్వహిస్తూ, ప్రతి గర్భిణీకి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించి, అవసరమైన ఫాలో అప్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిదంగా పీహెచ్‌సీ రొంపేడులో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించి, రోగి భద్రత, నాణ్యమైన వైద్య సేవలు, పరిశుభ్రత, మందుల వినియోగం, రోగులకు సరైన ఆరోగ్య సమాచారం అందించడం వంటి అంశాలపై డీఎంహెచ్ఓ అవగాహన కల్పించారు. రోగులకు వైద్యం అందించడం మాత్రమే కాకుండా ప్రతి రోగికి వ్యాధి నివారణ, మందుల వినియోగ విధానం, పోషకాహారం, పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవనశైలిపై తప్పనిసరిగా ఆరోగ్య విద్య అందించాలని సూచించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు లభించి, రోగనిరోధక శక్తి మెరుగుపడుతుందని వివరించారు. ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించేలా సిబ్బంది నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు ఆసుపత్రికి వచ్చినప్పుడు మాత్రమే కాకుండా క్షేత్రస్థాయి పర్యటనలు, ఆరోగ్య శిబిరాలు, ఇంటింటి సందర్శనలు, ఇతర ప్రజారోగ్య కార్యక్రమాల సమయంలో కూడా ప్రతి ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవసరమైన ఆరోగ్య విద్యను అందించాలని ఆదేశించారు. రోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వైద్య సేవల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి స్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేసి, ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఈనెల 17న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలి

- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణ




**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 15,(ప్రజా జ్యోతి)** హైదరాబాదులో ఈనెల 17న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు పిలుపునిచ్చారు, పాల్వంచ మండలం సత్యనారాయణపురం (మొండికట్ట) గ్రామంలో జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరవీరుల వారోత్సవ సభ లో ఆయన పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం లో 4500 మందికి పైగా నేలకొరిగినారని. భూమికోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం సాగిన ఆనాటి పోరాటంలో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ముగ్ధం మోహినుద్దీన్, షేక్ బందగి, చాకలి ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవి, దొడ్డి కొమరయ్య లాంటి ఎందరో వీరులు ప్రాణ త్యాగాలు చేసి 3500 గ్రామాలను విముక్తి చేసి పది లక్షల ఎకరాల భూములు పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ కి ఉందని అన్నారు, 1947లో భారతదేశం నుండి బ్రిటిష్‌వారు వెళ్ళిపోతూ స్వాతంత్రం ప్రకటించినప్పటికీ తెలంగాణలో మాత్రం నైజాం నిరంకుశ నవాబుల పరిపాలన కొనసాగిందని. 1947 సెప్టెంబర్ 11న కామ్రేడ్ రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మోహియుయుద్దీన్ లాంటి నాయకులు తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపునివ్వగా ఆ పిలుపునందుకొని లక్షలాదిమంది ప్రజలు ఆయుధాలు పట్టుకొని దొరలు, జమీందారులు, భూస్వాములను వెంటబడి తరిమినారని 1947 సెప్టెంబర్ 11 నుండి 1948 సెప్టెంబర్ నెల వరకు సాగిన ఈ సాయుధ పోరాటం చూసి హడలెత్తిన నిజాం నవాబులు, నెహ్రూ, పటేల్ ప్రభుత్వాలు వెంటనే కుట్ర పన్ని విసునూరు దొర రామచంద్రారెడ్డి, నిజాం నవాబుల తో చర్చలు జరిపి వారిని వెళ్లిపోమని. 1948 సెప్టెంబర్ 17న తెలంగాణను భారతదేశంలో విలీనం చేసినారని, అంతటి ఘన చరిత్ర కలిగిన తెలంగాణ పోరాటాన్ని, సెప్టెంబర్ 17 దినాన్ని వక్రీకరించి ప్రజలకు తప్పుడు సంకేతం అందించే ప్రయత్నాలు చేస్తున్నారని. బిజెపి దాని అనుబంధ ఆర్ఎస్ఎస్ తదితర సంఘాలు తెలంగాణ సాయుధ పోరాటంలో గాని, భారత స్వాతంత్రోద్యమ పోరాటంలో పాల్గొనలేదని అన్నారు, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు నిమ్మల రాంబాబు మాట్లాడుతూ నేడు భారతదేశంలో. దేశ ప్రజలందరికీ సరైన వసతులు కల్పించకుండా నిరుద్యోగులకు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నమ్మించి నిలువునా మోసం చేస్తూ. నిత్యవసర సరుకుల ధరలను విపరీతంగా పెంచి., రైతులకు యూరియా తదితర ఎరువులు ఆన్లైన్ పేరుతో సరిగా అందకుండా వ్యవసాయాన్ని సక్రమంగా చేసుకోనీయకుండా తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని. రైతు పండించినప్పుడు గిట్టుబాటు ధర లేకుండా చేసి, రైతు చేతి నుండి పంట అంతా వెళ్ళిపోయాక పెట్టుబడుదారులకు కోట్ల లాభాలు వచ్చే విధంగా పంటల ధరలను పెంచుతున్నారని. ప్రభుత్వ కంపెనీలను కోట్లాది రూపాయల లాభాల్లో ఉన్నటువంటి ఎల్ ఐ సి, బిఎస్ఎన్ఎల్ ,విశాఖ ఉక్కు లాంటి మంచి మంచి పరిశ్రమలను, సంస్థలను కూడా ప్రైవేటుపరం చేసి దేశాన్ని అధోగతి పాలు చేస్తున్నారని కోట్లాదిమంది కార్మికులకు ఉపాధి లేకుండా చేశారని ధ్వజమెత్తారు, సిపిఐ మండల రైతు సంఘ అధ్యక్షులు కొంగర అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో వివిధ మండలాలకు చెందిన సర్పంచులు, ప్రజా సంఘాల నాయకులు, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

## నేడు విశ్వకర్మ జయంతి

- శ్రీ మద్విరాట్ పోతులూరివీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 15,(ప్రజాజ్యోతి)** పాల్వంచ మండలం లక్ష్మీదేవి పల్లి గ్రామపంచాయతీలోనీ విరాట్ నగర్ లో గల పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ యజ్ఞం మహోత్సవం జయంతిని పురస్కరించుకొని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు నాంపల్లి వేణుగోపాలచారి తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ జయంతి సందర్భంగా నేడు ఆలయంలో జరిగే ప్రత్యేక పూజ కార్యక్రమానికి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, లక్ష్మీదేవి పల్లి సర్పంచ్ భూక్య మంజుల, ప్రముఖ కాంట్రాక్టర్ కొత్త వెంకటేశ్వర్లు, ప్రముఖ వైద్యులు బి సుధాకర్ రావు లు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆలయంలో ఉదయం 6 గంటలకు స్వామివారికి పంచామృతాభిషేకం, పతాకావిష్కరణ, మహాగణపతి పూజ పుణ్యాహవాచనం, మండపరాధన, మూల మంత్రములు, హోమం కార్యక్రమాలు ,మహా నైవేద్యం, మంగళహారతి, మంత్రపుష్పం లాంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు అనంతరం తీర్థప్రసాదాలు ఉంటాయన్నారు, కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశ్వకర్మ జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు, ఈ పూజ కార్యక్రమాలను ఆలయ ప్రధాన కార్యదర్శి మోతుకూరి రవీంద్ర చారి ,కోశాధికారి జుజ్జురి ప్రభాకరాచారి, కాపర్తి వెంకటాచారి మొగులూరు సీతారామ చారి, కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తారని తెలిపారు.

## భద్రాచలానికి మూడో వంతెన

- పాండురంగాపురం-భద్రాచలం-మల్కాన్‌గిరి రైల్వే లైన్‌కు ముందడుగు
- మోదీ చిత్రపటానికి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన బిజెపి నాయకులు



**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబర్ 15,(ప్రజాజ్యోతి)** భద్రాచలం ప్రాంత ప్రజల చిరకాల రైల్వే కలను సాకారం చేసే దిశగా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పాండురంగాపురం–భద్రాచలం–మల్కాన్‌గిరి 173.61 కిలోమీటర్ల నూతన రైల్వే లైన్‌ను మంజూరు చేయడాన్ని స్వాగతిస్తూ భద్రాచలంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ సెంటర్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ భద్రాచలం ప్రజలు ఎన్నో ఏళ్లుగా కోరుతున్న రైల్వే కనెక్టివిటీ కోసం గతంలో పాండురంగాపురం–సారపాక వరకు సుమారు 8 కి.మీ. రైల్వే లైన్‌ను ఏర్పాటు చేయాలని, అయితే మోదీ ప్రభుత్వం పాండురంగాపురం నుంచి భద్రాచలం మీదుగా మల్కాన్‌గిరి వరకు 2864 కోట్లతో 2031లోగా పూర్తి చేసేలా 173.61 కి.మీ. రైల్వే లైన్‌ను మంజూరు చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు, ఈ ప్రాజెక్టులో భద్రాచలం వద్ద గోదావరిపై మూడో రైల్వే వంతెన నిర్మాణం జరగడం ద్వారా భద్రాచలం నేరుగా రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానం కానుందని తెలిపారు. ఇది దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం ఆధ్యాత్మిక పర్యాటకాన్ని పెంచడంతో పాటు, ఏజెన్సీ గిరిజన ప్రాంతాల విద్య, వైద్యం, ఉపాధి, వ్యాపార అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఇప్పటికే మంజూరైన ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసి, ఎలాంటి జాప్యం లేకుండా రైల్వే శాఖకు భూమిని అప్పగించాలని బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుంజా ధర్మా, కుంజా సంతోష్, కందుల రాంకిషోర్, పసుమర్తి సతీష్, అట్లూరి రఘురామ్, ములిశెట్టి రాంమోహన్ రావు, ముత్యాల శ్రీనివాస్, కంద్రపు త్రినాథ్ రెడ్డి, నూప రమేష్, రామెళ్ళ రాజశేఖర్, పెద్ది జగపతి బాబు, నిడదవోలు నాగబాబు, తాటిపాముల ఐలయ్య, ముత్యాల చంద్రశేఖర్, దేవరపల్లి వెంకటేశ్వర్లు, ములిశెట్టి నిఖిల్, షేర్ శ్రీను, జీవా, మాలోత్ సాయి, కారం చిన్నయ్య, కోర్స గంగరాజు, సోలం చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.



## దండు సారయ్య స్వగృహంలో వినాయక చవితి వేడుకలు

- భక్తిశ్రద్ధలతో గణనాథుడికి ప్రత్యేక పూజలు
- కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహణ
- ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్ష





**ఇల్లందు, సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి )** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఇల్లందు మున్సిపల్ 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య స్వగృహంలో వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహానికి కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. వేదమంత్రాలు, భక్తి శ్లోకాల మధ్య గణపతికి పంచామృత అభిషేకం, పుష్పార్చన తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం స్వామివారికి నైవేద్యం సమర్పించి హారతి ఇచ్చారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో జీవించాలని 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా పరిసర ప్రాంతాల్లో భక్తి వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యులు, బంధువులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని గణనాథుడి ఆశీస్సులు పొందారు.

## అంబేద్కర్ ను అవమానిస్తే ఊరుకోం

- హమారా ప్రసాద్ ను అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలి
- అశ్వాపురంలో మాల జేఏసీ ఆందోళన



**అశ్వాపురం, సెప్టెంబర్ 15,ప్రజాజ్యోతి:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ను కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తూ పుస్తకం రచించడాన్ని నిరసిస్తూ అశ్వాపురం మండల కేంద్రంలో మాల జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. మాల జేఏసీ నాయకుడు చెట్టి సురేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.అంబేద్కర్ ను అవమానించే వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హమారా ప్రసాద్ ను వెంటనే అరెస్ట్ చేసి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో మద్దెల అన్నపూర్ణ, తోటమళ్ల నిర్మల, చెలికాని శ్రీను, రావుల రాధమ్మ, మేకల భాస్కర్, జూపెల్లి ధ్రువకుమార్, మోహన్ నాయక్, మంద రాంబాబు, తోట రమేష్, ఉండేటి రాజేష్, మేకల జార్జీ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్రం దేశానికే రోల్ మోడల్

- గిరిజనుల అభ్యున్నతికి తొలి సీఎం కేసీఆర్ కృషి ఎనలేనిది: మాజీ ఎమ్మెల్యే




**ఇల్లందు, సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి )**గిరిజనుల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్రం దేశానికే రోల్ మోడల్ అని, గిరిజనుల అభ్యున్నతికి తొలి సీఎం కేసీఆర్ కృషి ఎనలేనిదని మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ ఇల్లందు నియోజకవర్గ ఇంచార్జ్ బానోత్ హరిప్రియ నాయక్ అన్నారు. మంగళవారం స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర జాతిపిత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత గిరిజనుల అభ్యున్నతే ధ్యేయంగా గిరిజనుల సంక్షేమం కోసం వారికి సంక్షేమ ఫలాలను అందించడం కోసం గిరిజన రిజర్వేషన్ శాతాన్ని 6 నుండి 10 శాతానికి పెంచడం జరిగిందని గుర్తు చేశారు. 50 శాతానికి మించి రిజర్వేషన్లు పెంచకూడదని నిబంధన ఉన్నప్పటికీ గిరిజన జనాభాకు అనుకూలంగా కేసీఆర్ ధైర్యంతో రిజర్వేషన్ ను 10 శాతానికి పెంచాలని ఆనాటి ప్రభుత్వానికి నివేదిక పంపి, ఆమోదం రాకపోయినా అమలు చేశారని అది కేసీఆర్ కు గిరిజనుల ప ట్ల ఉన్న చిత్తశుద్ధి అని పేర్కొన్నారు. రిజర్వేషన్ల పెంపు వల్ల ఎందరో ఇటు విద్యా రంగంలో ఎన్నో ప్రయోజనాలు పొందుతున్నారని, అంతేకాకుండా 3146 తండాలను కూడా గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి స్థానిక సంస్థల్లో కూడా రిజర్వేషన్లు కల్పించడంతోపాటు గురుకులాలను ఏర్పాటు చేసి సేవాలాల్ జయంతిని కూడా అధికారికంగా నిర్వహించింది కేవలం కేసీఆర్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. గిరిజనుల పట్ల తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చూపిన దార్శనికతకు కృతజ్ఞతగా ఈనెల సెప్టెంబర్ 17న జాతీయ సమైక్యత దినోత్సవంతో పాటు ప్రతి తండా, ప్రతి గూడెంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పోడు భూముల పట్టాల పంపిణీ గిరిజనుల చిరకాల కోరికగా ఉన్నప్పటికీ పోడు భూముల సమస్యను పరిష్కరించి అర్హులైన పోడు రైతన్నలకు భూమిపై హక్కు పట్టాలను అందించడం జరిగిందని పేర్కొన్నారు. నేటి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులను అనేక రకాలుగా హింసకు గురిచేస్తుందని, ఉదాహరణకు లగచర్లలో గిరిజనుల భూములను గుంజుకొని గిరిజన మహిళల పట్ల ప్రవర్తించిన తీరు రాష్ట్ర ప్రజానీకం అందరు గమనించారని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలు 420 హామీలతో పాటు, ఎస్టీ, ఎస్సీ డిక్లరేషన్ యూత్ డిక్లరేషన్ ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని వర్గాల అన్ని రంగాల ప్రజలను వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించే రోజు దగ్గరలోనే ఉందని ప్రజలు కచ్చితంగా తమ ఓటు హక్కుతో తిరోగమనాన్ని కోరుకుంటున్నారని, రాబోయే కాలంలో ప్రజాక్షేత్రంలో కచ్చితంగా బుద్ధి చెప్పి తీరుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యుడు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, మహబూబాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ ఆంగోత్ బిందు, నాయకులు సిలివేరి సత్యనారాయణ, లకావత్ దేవిలాల్ నాయక్,లక్కినేని సురేందర్, అబ్దుల్ జబ్బార్, శీలం రమేష్, ఎస్ రంగనాథ్, భూక్య దళ్ సింగ్ నాయక్, బొమ్మెర్ల వరప్రసాద్, తాత గణేష్, బోడ బాలు నాయక్, బర్మావత్ లాల్ సింగ్, బండారి శ్రీను, జెకె శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాపర్ వైరు చోరీ.. ముగ్గురు అరెస్ట్

- రూ.3.57 లక్షల విలువైన 178.5 కిలోల కాపర్ వైరు స్వాధీనం
- ఆటో సీజ్.. ముగ్గురు అరెస్ట్.. మరో ఇద్దరు పరారీ



**టేకులపల్లి, సెప్టెంబర్15 (ప్రజా జ్యోతి)** వ్యవసాయ భూముల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైరు చోరీ చేస్తున్న ముగ్గురు వ్యక్తులను టేకులపల్లి పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఇల్లందు డిఎస్పి యు వెంకన్న బాబు తెలిపారు. మంగళవారం స్థానిక టేకులపల్లి పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పి వివరాలను వెల్లడించారు. ట్రాన్స్ ఫ్రార్మర్లను ధ్వంసం చేసిన నిందితుల వద్ద నుంచి రూ.3.57 లక్షల విలువైన 178.5 కిలోల కాపర్ వైరు, ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ పర్యవేక్షణలో ఎస్ఐ కె తిరుపతి సిబ్బందితో కలిసి సమ్మక్క–సారక్క గద్దెల వద్ద వాహన తనిఖీలు చేపట్టారని, కొత్తగూడెం వైపు నుంచి టేకులపల్లి వైపు వస్తున్న ఆటో పోలీసులను చూసి వెనక్కి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు పట్టుకొని విచారించారని పేర్కొన్నారు. విచారణలో పల్లపు వెంకటేష్(35), రౌతు రమేష్(34), వేముల సంతోష్(34)లు కలిసి చోరీలకు పాల్పడుతున్నట్లు వెల్లడైనట్లు తెలిపారు. జల్సాలకు అలవాటుపడి సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ముత్యాలంపాడు, కోయగూడెం, శాంతినగర్, సులానగర్, 9 మైల్ తండా, కొక్య తండా, బోడు ప్రాంతాల్లోని వ్యవసాయ భూముల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైరు చోరీ చేసినట్లు పేర్కొన్నారు. కొత్తగూడెంలోని సింగరేణి స్థలంలోనూ చోరీలకు పాల్పడినట్లు, చోరీ చేసిన కాపర్ వైర్‌ను ఆటోలో తరలించి పాల్వంచలోని సాయిరాం స్క్రాప్ షాప్‌తో పాటు తెలకపల్లి బాబుకు విక్రయించినట్లు నిందితులు వెల్లడించినట్లు తెలిపారు. ఈ కేసులో తెలకపల్లి బాబు, పాల్వంచకు చెందిన సాయిరాం పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్ఐ కె తిరుపతి, ఏఎస్ఐ బి నరసింహారావు, పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్ఐ కె తిరుపతి, ఏఎస్ఐ బి నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలి

- పి వై ఎల్ జిల్లా అధ్యక్షులు మంగయ్య
- గ్రామాలలో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలి
- ప్రతి గ్రామంలో దోమల మందు పిచికారి చేయాలి
- 24 గంటలు డాక్టర్స్ అందుబాటులో ఉండాలి




**గుండాల సెప్టెంబర్ 15 ప్రజాజ్యోతి** గుండాల ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలని పివైఎల్ జిల్లా అధ్యక్షులు మంగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం గుండాల మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో ఊకె. శ్రావణ్ అధ్యక్షతన పి వై ఎల్ మండల కమిటీ సమావేశం నిర్వహించారు ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మండలంలో 55 గ్రామాలు ఉండడంతో పాటు పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం కావడం జిల్లా కేంద్రానికి 80 కిలోమీటర్ల దూరంలో ఉండాల ఉండడంతో వైద్యం అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులు స్పందించి గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లను మందులను సరఫరా చేయాలని కోరారు మండల కేంద్రంలోని హాస్పటల్లో సరైన వైద్యం అందక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆరోపించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు సరిగా లేక మందులు సక్రమంగా అందువల్ల సరైన ట్రీట్మెంట్ లేక ప్రజలు ప్రైవేట్ హాస్పటల్ ను ఆశ్రయించాల్సి వస్తుందని , ఇదే అదునుగా ప్రవేట్ హాస్పటల్ యాజమాన్యం వేల రూపాయలు పేద ప్రజల నుండి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి గుండాల హాస్పటల్ కు 24 గంటల డాక్టర్లను అందుబాటులో ఉంచాలని, హాస్పటల్లో అన్ని రకాల టెస్టులు, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని, గ్రామాలలో వైద్య క్యాంపులు ఏర్పాటు చేసి పేద ప్రజలకు ఆదుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కల్తీ సుదర్శన్, కుంజ నరేష్, కొమరం సమ్మయ్య, ధర్మరాజు గణేష్ తత్తలు పాల్గొన్నారు.

# చరిత్రను వక్రీకరించలేరు...

# పోరాట స్ఫూర్తిని చెరపలేరు!

- తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను తప్పుగా చూపొద్దు..
- సెప్టెంబర్ 17ను మత విద్వేషాలకు వేదికగా మార్చొద్దు
- భూమి, భుక్తి, వెట్టి నిర్మూలన కోసం సాగిన ప్రజా పోరాటాన్ని చారిత్రక దృష్టితో చూడాలి
- పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడమే నేటి కర్తవ్యం
- విలీన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి : భూక్య శ్రీనివాస్




**కొత్తగూడెం, సెప్టెంబర్ 15, ప్రజా జ్యోతి :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను వక్రీకరించేందుకు ఎన్ని ప్రయత్నాలు జరిగినా దాని అసలు స్ఫూర్తిని ప్రజల నుంచి చెరిపివేయలేరని తెలంగాణ గిరిజన సమాఖ్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య శ్రీనివాస్ అన్నారు. సెప్టెంబర్ 17ను మత విద్వేషాలకు వేదికగా మార్చకుండా, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి సంబంధించిన చారిత్రక వాస్తవాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా తెలంగాణ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని శేషగిరి భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన భూక్య శ్రీనివాస్ మాట్లాడారు.

**భూమి.. భుక్తి.. వెట్టి నిర్మూలన కోసం పోరాటం..**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం కేవలం ఒక ప్రాంతీయ తిరుగుబాటు కాదని, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ నిర్మూలన కోసం, సామాజిక న్యాయం కోసం, పీడిత ప్రజల విముక్తి కోసం సాగిన మహత్తర ప్రజా ఉద్యమమని శ్రీనివాస్ పేర్కొన్నారు. నిజాం సంస్థానంలోని ఫ్యూడల్ వ్యవస్థలో పేద రైతులు, కూలీలు, కౌలు రైతులు, గిరిజనులు, దళితులు, వెనుకబడిన వర్గాలు అనేక రకాల దోపిడీ, అణచివేతకు గురయ్యారని తెలిపారు. దొరలు, దేశ్‌ముఖ్‌లు, జాగీర్దార్లు, భూస్వామ్య శక్తుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా గ్రామీణ ప్రజలు సంఘటితమై పోరాటం చేశారని అన్నారు. "తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం పేరు వినగానే ఆకాశం అరుణపతాకమై రెపరెపలాడుతుంది. భూమి పిడికిలై మొలకెత్తుతుంది. గాలి అమరుల త్యాగాల రాగమై మోగుతుంది. ఆ చరిత్రను ఎవరెన్ని రకాలుగా వక్రీకరించినా దాని స్ఫూర్తిని ప్రజల మనసుల నుంచి చెరిపివేయలేరు. నిప్పును గుప్పిట మూయగలరా?" అని ప్రశ్నించారు.

**చరిత్రను మతాల మధ్య ఘర్షణగా చూడొద్దు**

సెప్టెంబర్ 17 చారిత్రక పరిణామాలను కేవలం మతపరమైన కోణంలో చూడటం సరికాదని శ్రీనివాస్ అన్నారు. నిజాం ముస్లిం పాలకుడైనప్పటికీ, అప్పటి ఫ్యూడల్ సామాజిక–ఆర్థిక వ్యవస్థలో వివిధ వర్గాలకు చెందిన భూస్వామ్య శక్తులు ప్రజలపై ఆధిప త్యం చెలాయించాయని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని కేవలం "హిందువులు–ముస్లిం ల మధ్య పోరాటం"గా చిత్రించడం ద్వారా భూమి, శ్రమ, సామాజిక న్యా యం, వెట్టి చాకిరీ, భూస్వామ్య దోపిడీ వంటి అసలు సమస్యలు మరుగునపడతాయని విమర్శించారు. పోరాటంలో వివిధ మతాలు, కులాలు, సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారని తెలిపారు. అందువల్ల చరిత్రను మతాల మధ్య ద్వంద్వంగా కాకుండా పీడకులు–పీడితులు, దోపిడీదారులు –దోపిడీకి గురైన ప్రజల మధ్య జరిగిన పోరాటంగా అర్థం చేసుకోవాలని సూచించారు.

**రజాకార్ల దౌర్జన్యాలను ఖండించాలి**

రజాకార్ మూకలు ప్రజలపై జరిపిన దాడులు, హింస, అణచివేతలను ఎవరూ సమర్థించలేరని శ్రీనివాస్ స్పష్టం చేశారు. అయితే రజాకార్ హింసను ఆధారంగా చేసుకుని మొత్తం తెలంగాణ పోరాటాన్ని ఒక మతానికి వ్యతిరేకంగా జరిగిన యుద్ధంగా చిత్రించడం కూడా సరికాదన్నారు. రజాకార్లను, ఫ్యూడల్ దోపిడీని, నిరంకుశ పాలనను వ్యతిరేకించిన వివిధ మతాలకు చెందిన ప్రజలు, మేధావులు, రచయితలు, ఉద్యమకారుల పాత్రను కూడా చరిత్రలో గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. షోయబుల్లాఖాన్, మఖ్దూమ్ మొహియుద్దీన్ వంటి వ్యక్తుల పాత్రను కూడా ఈ నేపథ్యంలో పరిశీలించాలని పేర్కొన్నారు.

**సెప్టెంబర్ 17పై చారిత్రక దృష్టి అవసరం**

1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన పరిణామానికి వివిధ రాజకీయ నిర్వచనాలు ఉన్నాయని శ్రీనివాస్ అన్నారు. "విమోచన దినం", "విలీన దినం", "జాతీయ సమైక్యతా దినం" వంటి పేర్లతో నిర్వహించే కార్యక్రమాలు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం యొక్క ప్రజా స్వభావాన్ని మరుగునపరచకూడదన్నారు. సెప్టెంబర్ 17తోనే తెలంగాణ ప్రజల విమోచనం పూర్తయిందనే సరళమైన వివరణ చారిత్రక పరిణామాలన్నింటినీ ప్రతిబింబించదన్నారు. నిజాం పాలన ముగిసిన తర్వాత కూడా తెలంగాణలో కమ్యూనిస్టు సాయుధ పోరాటం కొనసాగిన విషయాన్ని చరిత్రలో భాగంగా చూడాల్సిన అవసరం ఉందన్నారు.

**పోరాట వారసత్వాన్ని ఎవరూ చెరిపివేయలేరు**

ప్రజలను సంఘటితం చేసి, భూమి సమస్యపై పోరాడించి, వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి, ఫ్యూడల్ దోపిడీకి సవాలు విసిరిన ఉద్యమంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ప్రత్యేక స్థానం ఉందని శ్రీనివాస్ అన్నారు. ఈ పోరాటంలో కమ్యూనిస్టు ఉద్యమం పోషించిన పాత్రను చరిత్ర నుంచి తొలగించే ప్రయత్నాలు సరికావని అన్నారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా గ్రామస్థాయి లో ప్రజా ప్రతిఘటన విస్తరించిన నేపథ్యంలోనే తదుపరి రాజకీయ, సైనిక పరిణామాలు చోటుచేసుకున్నాయని తెలిపారు.

**శ్రమజీవుల ఐక్యతే పోరాట స్ఫూర్తి**

తెలంగాణ పోరాటం భూమి కోసం మాత్రమే కాకుండా శ్రమకు గౌరవం, సామాజిక సమానత్వం, ప్రజా హక్కులు, దోపిడీకి వ్యతిరేకత కోసం సాగిన విస్తృత ఉద్యమమని అన్నారు. శ్రీశ్రీ రచనలోని "కమ్మరి కొలిమి.. కుమ్మరి చక్రం.. జాలరి పగ్గం.. సాలెల మగ్గం.." వంటి శ్రమజీవుల ప్రతీకలను ప్రస్తావిస్తూ, వివిధ వృత్తులు, కులాలు, సామాజిక వర్గాలకు చెందిన శ్రమజీవుల ఐక్యతను తెలంగాణ పోరాటం ప్రతిబింబించిందన్నారు.

**ప్రజా హక్కుల పరిరక్షణకు స్ఫూర్తి కావాలి**

ప్రస్తుతం ఆకలి, నిరుద్యోగం, ధరల పెరుగుదల, ఆర్థిక అసమానతలు, రైతులు–కార్మికుల సమస్యలు, గిరిజనుల హక్కులు, సామాజిక వివక్ష వంటి సమస్యలు కొనసాగుతున్నాయని శ్రీనివాస్ అన్నారు. చరిత్రను మత విద్వేషాలకు ఉపయోగించకుండా ప్రజల్లో ఐకృతను పెంపొందించేందుకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రజా హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, మత సామరస్యం, దోపిడీకి వ్యతిరేక పోరాటం కోసం ఆ చరిత్ర నుంచి స్ఫూర్తి పొందాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తూ, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను సమగ్రంగా ప్రజలకు తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ గిరిజన సమాఖ్య నాయకులు బానోతు వెంకట్, గోవిందు, ఉపేందర్, హత్తిరా మ్, హరి, రమేష్, సురేష్, రమేష్‌బాబు, బావు సింగ్, మోహన్, రవి, రాంప్రసాద్, చందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పదిహేను రోజులుగా పరిష్కారం కానీ తాగునీటి సమస్య

- కొత్త అంజనాపురం గ్రామపంచాయతీలో మూతపడిన సురక్షిత మంచినీటి కేంద్రం
- నవభారత్ వెంచర్ లిమిటెడ్ ద్వారా ఏర్పాటు చేసిన కేంద్రం పనిచేయకపోవడంతో గ్రామస్తుల ఆందోళన



**సుజాతానగర్, సెప్టెంబర్ 15: ప్రజా జ్యోతి :–** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతానగర్ మండలం కొత్త అంజనాపురం గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన సురక్షిత మంచినీటి కేంద్రం గత పదిహేను రోజులుగా పనిచేయకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నవభారత్ వెంచర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ మంచినీటి కేంద్రం కొంతకాలంగా ప్రజలకు ఉపయోగకరంగా ఉండగా, ప్రస్తుతం సాంకేతిక సమస్య కారణంగా తాగునీటి సరఫరా నిలిచిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. గ్రామంలో తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఈ కేంద్రం పనిచేయకపోవడంతో ప్రజలు ఇతర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు వాపోతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

**పదిహేను రోజులైనా పరిష్కారం ఎప్పుడు?**

మంచినీటి కేంద్రం పనిచేయడం లేదని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, సమస్యకు ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోజులు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామస్తుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. గ్రామపంచాయతీ కార్యదర్శి దృష్టికి సమస్యను తీసుకెళ్లగా, సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. అయితే "ఇంకెన్ని రోజులకు ఈ తాగునీటి సమస్య పరిష్కారం అవుతుంది?" అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**అధికారులు వెంటనే స్పందించాలి**

తాగునీరు ప్రతి కుటుంబానికి అత్యవసర అవసరమని, ఇలాంటి సమస్యలను రోజులు తరబడి పెండింగ్‌లో ఉంచకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. మంచినీటి కేంద్రంలో ఉన్న సాంకేతిక లోపాలను పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టి వెంటనే తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే గ్రామపంచాయతీ అధికారులు, సంబంధిత సంస్థ ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఇకపై కొనసాగకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

## ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ప్రయోజనం

- ఒక్క ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలి: జిల్లా వ్యవసాయ అధికారి బాబు రావు



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 15, (ప్రజా జ్యోతి):** జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పెద్దిరెడ్డిగూడెం రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విధానాలు, వాటి ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయ అధికారి బాబు రావు మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా ఒక్క ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని సూచించారు. రసాయనిక ఎరువులు, సస్యరక్షణ మందులను నివారిస్తూ పంట మార్పిడి, పలు పంటల విధానాలను పాటించాలని తెలిపారు. పశుపోషణ ద్వారా లభించే సహజ ఎరువులను వినియోగించుకోవడంతో పాటు సేంద్రియ వ్యర్థాలను కంపోస్ట్‌గా మార్చి పొలాల్లో ఉపయోగించాలని సూచించారు. వరి సాగులో పచ్చిరొట్ట, అజోల్లా, జీవామృతం వినియోగంతో నేల సారాన్ని, పంటల నాణ్యతను పెంచుకోవచ్చని వివరించారు. బయోచార్ ద్వారా నేలలో తేమ, పోషకాలను ఎక్కువకాలం నిల్వ చేసుకోవచ్చన్నారు. వరిని నేరుగా విక్రయించకుండా విలువ జోడింపు పద్ధతులను అవలంబించి రైతులు అదనపు ఆదాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు రవి కుమార్, మండల వ్యవసాయ అధికారి అనూష, వ్యవసాయ విస్తరణ అధికారి సంధ్య రాణి, ఉప సర్పంచ్ నరేష్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

## భూ భారతి రీ-సర్వే వేగవంతం...

- అనంతారంలో రెవెన్యూ రీ-సర్వే పనులను పరిశీలన...
- భూ వివరాల నమోదులో నిర్లక్ష్యం వద్దు...
- అధికారులకు ఆదేశించిన జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్...




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. సెప్టెంబర్ 15, ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెవెన్యూ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి రీ–సర్వే పనులు మణుగూరు మండలంలో శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మణుగూరు మండలం అనంతారం గ్రామంలో జరుగుతున్న రీ–సర్వే పనులను భద్రాద్రి జిల్లా జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే పనుల పురోగతిని స్వయంగా పరిశీలించారు. భూముల హద్దుల గుర్తింపు, డ్రోన్ ద్వారా సేకరిస్తున్న వివరాలు, పాత రికార్డులతో అనుసంధానం, రైతుల నుండి తీసుకుంటున్న వివరాల నమోదు ప్రక్రియపై అధికారులను ఆరా తీశారు.ఈ సర్వే భవిష్యత్తులో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేలా ఉండాలని, అందుకే ప్రతి సర్వే నంబర్ ను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, వారికి సర్వే ప్రాముఖ్యతను వివరించి రైతుల సహకారం తీసుకోవాలని ఆయన సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మణుగూరు తహసీల్దార్ నరేష్, సర్వేయర్ నరేష్, ఆర్ఐ రమేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలి

- రావులపల్లి రాంప్రసాద్





**చర్ల, సెప్టెంబర్ 15:(ప్రజా జ్యోతి):** చర్ల మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం మండల కన్వీనర్ దొడ్డి తాతారావు అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రావులపల్లి రాంప్రసాద్, మాజీ ఇన్‌చార్జ్ మనే రామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రావులపల్లి రాంప్రసాద్ మాట్లాడుతూ పార్టీని మండల స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై నిరసన కార్యక్రమాలను చేపట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలను విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల్లో ఇసుక లారీల కారణంగా జరుగుతున్న ప్రమాదాలపై ప్రజల తరపున పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే తాలిపేరు నీటితో కాలువలను నింపడం, భద్రాచలం నుంచి చర్ల వరకు రహదారి పనులను వేగవంతం చేయడం వంటి ప్రజా సమస్యలపై పంచాయతీల వారీగా కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లోకి పార్టీని మరింతగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కో–కన్వీనర్ ఐనవోలు పవన్, సీనియర్ నాయకులు ఎస్‌డీ అజీజ్, యడ్ల రామదాసు, కాకి అనిల్, కుప్పాల నిరంజన్, తోటపల్లి మాధవరావు, గోరింట్ల వెంకటేశ్వరరావు, ఎన్నమూరి సృజన్, గాదంశెట్టి కిషోర్, పాసిగంటి సంతోష్, ఎస్‌కే షాదిక్, కారం కన్నారావు, అలవాల కృష్ణ, కనుక వీరభద్రం, వేములవాడ కృష్ణతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఫిర్యాదు చేసింది..

# న్యాయం దక్కలేదు...

- సింగరేణిలో అక్షిత రాణి విషాదం.. అసలు నిజమేంటి?
- అప్రెంటిస్ షిప్ సమయంలో వేధింపుల ఆరోపణలు..
- ముందే ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదంటూ ఆరోపణలు..
- అధికారుల నుండి న్యాయం దక్కలేదంటూ ఆత్మహత్యాయత్నం
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి..
- ఇది యాజమాన్య నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమా..?

**సింగరేణి సంస్థలో అప్రెంటిస్ షిప్ చేస్తున్న మైనింగ్ ఇంజినీరింగ్ విద్యార్థిని తాండ్ర అక్షిత రాణి(20) మృతి ఘటన కలకలం రేపుతోంది. రామగుండంలోని జీడీకే-2 ఇన్ క్లైన్ లో శిక్షణ పొందుతున్న సమయంలో తనపై ఓవర్ మన్ అత్యాచారానికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ ఆమె సూసైడ్ నోట్ లో పేర్కొన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ ఆరోపణలు సింగరేణి వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి.**

**- భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ప్రజాజ్యోతి**

### ›› ఫిర్యాదు చేసినా.. న్యాయం జరగలేదా?

అక్షిత రాణి అప్రెంటిస్ షిప్ లో భాగంగా జీడీకే–2 ఇన్ క్లైన్ కు వెళ్లిన సమయంలో ఓవర్ మన్ తనను లైంగికంగా వేధించాడని, అత్యాచారానికి పాల్పడ్డాడని ఆరోపించినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఆమె యూనియన్ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినట్లు కూడా సమాచారం. అనంతరం ఆమె ఇచ్చిన ఫిర్యాదుపై సింగరేణి అధికారులు విచారణ చేపట్టినట్లు తెలుస్తున్నా.. ఆ విచారణలో తనకు న్యాయం జరగలేదని అక్షిత భావించినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అయితే ఈ ఘటనలో ఇప్పుడు ప్రధానంగా వెలుగులోకి రావాల్సిన అంశం ఇదే. అక్షిత ముందుగానే తనపై జరిగిన వేధింపుల గురించి ఫిర్యాదు చేసి ఉంటే.. ఆ ఫిర్యాదును ఎవరు స్వీకరించారు? ఎప్పుడు విచారణ చేపట్టారు? విచారణలో ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేశారా? ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓవర్ మన్ పై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.సూసైడ్ నోట్ లో తనకు జరిగిన అన్యాయాన్ని ప్రస్తావిస్తూ, తన మరణానికి కారణమైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరినట్లు సమాచారం. అంతేకాకుండా తనకు న్యాయం చేయాలని, తన కుటుంబానికి అండగా నిలవాలని ఆమె కోరినట్లు తెలుస్తోంది.

### ›› విచారణ రికార్డులు బయటపెట్టాలి..

అక్షిత మరణంతో ఇప్పుడు సింగరేణి యాజమాన్యం స్పందించాల్సిన అవసరం ఏర్పడింది. ఆమె గతంలో ఇచ్చిన ఫిర్యాదు, దానిపై జరిగిన విచారణ, సంబంధిత అధికారుల నివేదికలు బయటకు వస్తేనే అసలు విషయం స్పష్టమవుతుంది. ఒక అప్రెంటిస్ విద్యార్థిని తనపై తీవ్రమైన ఆరోపణలు చేస్తూ ఫిర్యాదు చేసినప్పుడు సంస్థ యంత్రాంగం ఏ విధంగా స్పందించిందన్నది కీలకంగా మారింది.

### ›› ఆరోపణలు నిజమా?

అక్షిత రాణి సూసైడ్ నోట్ లో చేసిన ఆరోపణలు నిజమా? ఆమె ఫిర్యాదుపై సింగరేణి అధికారులు నిబంధనల ప్రకారం వ్యవహరించారా? విచారణలో లోపాలు ఏమైనా జరిగాయా? అనే అంశాలపై సమగ్ర దర్యాప్తు జరగాలి. ఆరోపణలను ముందుగానే నిజమని నిర్ధారించడం ఎంత తప్పో, వాటిని విస్మరించడం కూడా అంతే తప్పు. అయితే అక్షిత రాణి మరణంతో ఒక కుటుంబం విషాదంలో మునిగిపోయింది. కానీ ఆమె ఫిర్యాదు, సూసైడ్ నోట్ లోని ఆరోపణలు ఇప్పుడు సింగరేణి యాజమాన్యం ముందు కీలక ప్రశ్నలుగా నిలిచాయి. ఆ ప్రశ్నలకు సమాధానాలు బయటకు రావాల్సిందే.

## ఏఐటీయూసీ నేతలపై వరుస ఆరోపణలు!....

**అక్షిత రాణి ఘటనలో ఆమెను వేధించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ఏఐటీయూసీ నేతగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనతో పాటు సంబంధిత ప్రాంతంలో ఏఐటీయూసీ నేతలపై గతంలోనూ పలు ఆరోపణలు ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మహిళా కార్మికులు, ఉద్యోగుల విషయంలో వేధింపులకు పాల్పడుతున్నారన్న విమర్శలతో పాటు బదిలీలు, డిప్యూటేషన్లు, పని ప్రదేశాల్లో పోస్టింగులు తదితర వ్యవహారాల్లో నేతల జోక్యంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత ఆర్జీ ప్రాంత జీఎంతో సన్నిహితంగా ఉంటూ తమకు అనుకూలంగా వ్యవహరించేలా ఒత్తిడి తెస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి వాస్తవాలను నిర్ధారించాల్సి ఉంది. అక్షిత ఘటనతోపాటు గతంలో వచ్చిన ఫిర్యాదులు, బదిలీలు, డిప్యూటేషన్లు, వర్క్ ప్లేస్ వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిగితేనే ఈ ఆరోపణల్లో నిజానిజాలు తేలే అవకాశం ఉంది.**